# జైలు నుంచి అల్లు అర్జున్ విడుదల

- ఇంటివద్ద పలువురు సినీ ప్రముఖుల పరామర్శ
- మద్దతిచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలిపిన పుష్ప

బంజారాహిల్స్, డిసెంబర్ 14: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అరెస్టయిన అల్లు అర్జున్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో శనివారం ఉదయం 6.15 గంటలకు జైలు నుంచి విడుదలయ్యారు. శుక్రవారం సాయంత్రమే హైకోర్టు బెయిల్ ఇచ్చినా ఆర్డర్ కాపీ సకాలంలో తమకు చేరలేదంటూ చంచల్‌గూడ జైలు అధికారులు అల్లు అర్జున్‌ను విడుదల చేయలేదు. శనివారం ఉదయం విడుదలైన బన్నీ నేరుగా జూబ్లీహిల్స్ రోడ్ నెం 45లోని గీతా ఆర్ట్స్ కార్యాలయానికి చేరుకున్నారు. గంటపాటు అక్కడే ఉన్న ఆయన, తన కేసు వాదించిన న్యాయవాదుల బృందంతో చర్చించారు. ఆయన ఇంటికి వెళ్లగానే కొడుకు అయాన్, భార్య స్నేహా రెడ్డి, కుమార్తె అర్హ పరుగున వచ్చి ఆలింగనాలు చేసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనకు మద్దతిచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కేసు కోర్టులో ఉన్నందున తాను ఏమీ మాట్లాడబోనని, చట్టాన్ని గౌరవించే వ్యక్తిని అని పేర్కొన్నారు. 20 ఏండ్లుగా అనేక సార్లు అభిమానులతో కలిసి సినిమాలు చూసానని ఏనాడూ జరగని దుర్ఘటన పుష్ప -2 ప్రీమియర్‌షోలో జరగడం బాధ కలిగించిందని, ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. అల్లు అర్జున్ విడుదల విషయం తెలిసి సినీ ప్రముఖులు ఆయన ఇంటికి తరలివచ్చారు. దర్శకులు సుకుమార్, వంశీ పైడిపల్లి, త్రివిక్రమ్, రాఘవేంద్ర రావు, కొరటాల శివ, నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవి, దిల్‌రాజు, నటులు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, రాణా దగ్గుబాటి, నాగచైతన్య, ఆర్ నారాయణ మూర్తి, పలువురు సినీ ప్రముఖులు అల్లు అర్జున్ ఇంటికి వచ్చి పరామర్శించారు.

# అల్లు అర్జున్ అరెస్టు వెనుక కుట్ర కోణం

- సీఎం వ్యాఖ్యలు సరికాదు
- గాయని కల్పనా రాఘవేంద్ర

గాయని కల్పన

ఖైరతాబాద్, డిసెంబర్ 14 : అల్లు అర్జున్ అరెస్టు వెనుక కుట్ర కోణం దాగున్నదని గాయని కల్పనా రాఘవేంద్ర అనుమానం వ్యక్తంచేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆమె మాట్లాడారు. అల్లు అర్జున్ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశంలో ఒక ఐకానిక్ స్టార్‌లా ఉన్నారని తెలిపారు. అలాంటి వ్యక్తిని బెడ్రూమ్‌లోకి వెళ్లి అరెస్టు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. సినిమా పెట్టుబడి వ్యాపారమని, లాభాల కోసమే సినిమా తీస్తారని, డబ్బుల కోసమే నటిస్తారంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. పుష్ప-2 చిత్రం వెయ్యి కోట్ల లాభాలను ఆర్జించిందని, అందులో 18 శాతం జీఎస్‌టీ ప్రభుత్వానికి చేరుతుందని సీఎంకు తెలియదా అని ఆమె ప్రశ్నించారు. మహిళ మృతి వెనుక హత్య లాంటి కుట్ర కోణం దాగి ఉండొచ్చని, విచారణ చేపట్టాలన్నారు.

# చట్టం ముందు అందరూ సమానులే!

**మహిళ చనిపోతే కేసు పెట్టొద్దా? • టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్**

హైదరాబాద్, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): చట్టం ముందు అందరూ సమానులేనని, తొక్కిసలాటలో ఒక మహిళ మరణిస్తే కేసు పెట్టొద్దా? అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో సామాన్యురాలు ప్రాణాలు కోల్పోయిందని, ఆమె కొడుకు చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడని తెలిపారు. ఈ విషయంలో కేసు పెట్టడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని, అందుకే అల్లు అర్జున్‌పై పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. అల్లు అర్జున్ మామ తమ పార్టీకి చెందిన నాయకుడేనని, తెలుగు చిత్ర పరిశ్రమకు కాంగ్రెస్ పార్టీకి విడదీయరాని బంధం ఉన్నదని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసిందని తెలిపారు ఈ-కార్ రేస్ పోటీల్లో నిధుల గోల్‌మాల్ జరిగినట్టు అధికారులు గుర్తించారని, ఇందులో కేటీఆర్ అక్రమాలకు పాల్పడినట్టు తేలితే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

# ప్రాణం పోతున్నా.. ప్రజాభవన్‌కు రావాల్నా?

- ఆహార భద్రత కార్డులో పేరు లేకపోతే అవస్థలే
- ఆరోగ్యశ్రీ లబ్ధి కోసం హైదరాబాద్ వెళ్లాల్సిందే
- రోగి స్వయంగా రావాల్సిందేనని కాంగ్రెస్ సర్కారు రూల్

భార్య, బిడ్డతో బాధితుడు లింగయ్య

జగిత్యాల మల్యాల డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): అనారోగ్యంతో దవాఖానలో చేరితే పేదల పాలిట పెన్నిధిగా నిలిచే ఆరోగ్యశ్రీ పథకం కాంగ్రెస్ పాలనలో పరిహాసానికి గురవుతున్నది. సాంకేతిక కారణాలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదాహరణకు జగిత్యాల జిల్లా మల్యాలకు చెందిన పొన్నం లింగయ్యకు కిడ్నీ చెడిపోయిందని వైద్యులు తెలిపారు. వీలైనంత త్వరగా రెండు ఆపరేషన్‌లు చేయాలని అన్నారు. లింగయ్య కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డు ఉంది. కానీ ఆహారభద్రత కార్డులో పేరు నమోదుకాలేదు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు వెళ్లి అనుమతి తెచ్చుకోవాలని వైద్యులు సూచించారు. లింగయ్య భార్య, పిల్లలు ప్రజాభవన్‌కు వెళ్లి అధికారులను వేడుకున్నారు. రోగి వస్తేనే లెటర్ ఇస్తామని అధికారులు తేల్చిచెప్పారు. రోగి రాలేని పరిస్థితిలో ఉన్నాడని చెప్పినా ఒప్పుకోలేదు. రోగి ఏమైనా వెంటిలేషన్ మీద చికిత్స తీసుకుంటున్నాడా అంటూ జాలి లేకుండా మాట్లాడారు. గత్యంతరం లింగయ్యను కూడా వెంట బెట్టుకున్నారు. లింగయ్య ఒక్కరే కాదు నిత్యం చాలామంది రోగులు ప్రజాభవన్‌లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నారు. అసలేమైందంటే..!

మల్యాలకు చెందిన పొన్నం లింగయ్యకు భార్య లత, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. 2005లో బతుకుదెరువు కోసం దుబాయ్ బాట పట్టాడు. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ హయాంలో రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేశారు. 2012లో కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఫ్యామిలీ కార్డులు ఇచ్చి, ఆరోగ్యశ్రీకి అనుసంధానం చేశారు. 2016లో ఇంటికి వచ్చిన లింగయ్య గుండెపోటుకు గురయ్యాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో ఆరోగ్యశ్రీ కార్డుతో ఆపరేషన్ చేయించుకున్నాడు. ఆ తర్వాత మళ్లీ దుబాయికి వెళ్లాడు. ఈ ఏడాది సెప్టెంబర్ 30న లింగయ్య ఇంటికి వచ్చాడు. అనారోగ్యంతో దవాఖానకు వెళ్లగా, కిడ్నీ పూర్తిగా చెడిపోయిందని వైద్యులు స్పష్టంచేశారు. కానీ ఆహారభద్రత కార్డులో పేరు లేనందున, ఉచిత చికిత్స సాధ్యం కాదని చెప్పారు. లింగయ్యతో పాటు కుటుంబ సభ్యులంతా అవస్థలు పడుతూ ప్రజాభవన్‌కు వెళ్లి లెటర్ తీసుకున్నారు. లింగయ్య నవంబర్ 13న దవాఖానలో చేరగా వైద్యులు ఆపరేషన్ చేశారు. ఎనిమిదేండ్ల క్రితం గుండె ఆపరేషన్ సమయంలో ఇంత పరేషాన్ కాలేదని లింగయ్య గుర్తుచేసుకుంటున్నాడు.

## ఆహార భద్రత కార్డులో పేరుంటేనే ఆరోగ్యశ్రీ

ఆహార భద్రత కార్డుల జారీ తర్వాత పుట్టిన పిల్లలకు, కార్డుల జారీ సమయంలో విదేశాల్లో ఉండి బయోమెట్రిక్ ద్వారా వివరాలు నమోదు కాని వాళ్లకు ఆరోగ్యశ్రీ వర్తింపులో సమస్యలు వస్తున్నాయి. అత్యవసర సమయాల్లో కలెక్టర్లు అనుమతి ఇచ్చేలా ప్రభుత్వం నిబంధనలు మార్చాలని రోగులు కోరుతున్నారు. లేదంటే ఆపదలో పేదల ప్రాణాలమీదకు వస్తుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

# జైల్లో ఎందుకు పెట్టాలనుకున్నారు?

- ఇండస్ట్రీపై కక్ష ఎందుకు?
- అర్జున్ అరెస్టుపై సినీ వర్గాల్లో చర్చ
- వ్యతిరేకత రావడంతో 'మాకు బంధువే' డైలాగ్
- సర్కారుపై దుమ్మెత్తిపోస్తున్న సినీ అభిమానులు

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ప్రముఖ సినీనటుడు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసిన తీరు, ఒక్క రోజైనా జైల్లో పెట్టాలన్నట్టుగా సర్కారు పెద్దలు కక్షతో వ్యవహరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఉద్దేశమేంటి? వ్యక్తిగతంగా కక్షగట్టినట్టుగా సీఎం రేవంత్, ప్రభుత్వంలోని ముఖ్యులు మాట్లాడుతున్నారని సినీవర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నది. సినీపరిశ్రమను దారిలోకి తెచ్చుకోవడం కోసమే ఇదంతా జరిగిందని కొందరు చెబుతుంటే వసూళ్ల దందాలో భాగంగానే ఇదంతా జరుగుతున్నదని మరికొందరు చెబుతున్నారు.

### బ్లాక్‌మెయిల్ కోసం సర్కార్ బ్రోకర్?

టాలీవుడ్‌ను గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే జాతీయస్థాయి గుర్తింపు కలిగిన అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిందని సినీప్రముఖులు అంటున్నారు. అంతేకాకుండా సినిమా పెద్దలను బెదిరించేందుకు 'కొంతమంది' ఓ బ్లాక్‌మెయిలర్‌ను రంగంలోకి దించినట్టు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల కోసం ఇప్పట్నుంచే డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే కోట్లలో వ్యాపారం చేస్తున్న నిర్మాతలు, భారీగా ఆర్జిస్తున్న నటులను టార్గెట్ చేసినట్టు పేర్కొంటున్నారు. సినిమాలకు అనుమతులు ఇచ్చే దగ్గర్నుంచి, టికెట్ల ధరల పెంపు వరకు ప్రభుత్వ పెద్దల సహకారం అవసరం ఉంటుంది. ఇదే అవకాశంగా తీసుకున్న 'కొందరు' మాట వినని వారిని దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని సినీప్రముఖులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ 'పెద్దలు' సినీ పరిశ్రమను సున్నితంగా హ్యాండిల్ చేశారని, ఈ సర్కారు మాత్రం ప్రముఖులను ఇబ్బందులు పెడుతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### అరెస్ట్ చట్టం.. అర్జున్ చుట్టం?

అల్లు అర్జున్ అరెస్టుతో కాంగ్రెస్ సర్కారు, సీఎం రేవంత్‌పై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. సోషల్ మీడియాలో అయితే నెటిజన్స్ ఓ రేంజ్‌లో ఆడుకుంటున్నారు. శుక్రవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్‌ను జాతీయ మీడియా ప్రతినిధులు నిలదీశారు. అల్లు అర్జున్ అరెస్ట్ కక్ష సాధింపులో భాగం అనే విమర్శల నుంచి బయటపడేందుకు సీఎంతోపాటు ప్రభుత్వ పెద్దలు కొత్త ఎత్తుగడ వేశారని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో 'అల్లు అర్జున్ మా బంధువే' 'అల్లు అర్జున్ భార్య మాకు చుట్టమే' 'మెగా ఫ్యామిలీకి మేము చాలా క్లోజ్' అనే డైలాగులు కాంగ్రెస్ నేతల నోట వినిపిస్తున్నాయని అంటున్నారు.

### ఈ సారి మాత్రం తగ్గేదేలే!

నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అభ్యంతకర వ్యాఖ్యలను సినీ పరిశ్రమ ముక్తకంఠంతో ఖండించింది. ఇప్పుడు అల్లు అర్జున్ అరెస్ట్‌పై మరోసారి గట్టిగా స్పందించాలని సినీపెద్దల మధ్య చర్చ జరిగినట్టు తెలుస్తున్నది. వేల కోట్లు పన్నులు కడుతున్న తమపై వేధింపులేంటని కొందరు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. స్వార్థం కోసం తమను వేధిస్తే ఊరుకోమని చెబుతున్నారు.

# చిరుత దాడిలో మహిళకు గాయాలు

**రిమ్స్‌కు తరలింపు**

బజార్‌హత్నూర్, డిసెంబర్ 14 : ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం డేడ్రా గ్రామానికి చెందిన గిరిజన మహిళ హర్క భీంబాయి(50)పై చిరుత పులి దాడి చేసిన ఘటన శనివారం చోటుచేసుకున్నది. ఎఫ్ఎస్‌వో వివరాల ప్రకారం.. భీంబాయి ఉదయం ఐదు గంటలకు గ్రామ శివారులో బహిర్భూమికి వెళ్లగా పొదల్లో నుంచి ఒక్కసారిగా చిరుత పులి వచ్చి దాడిచేసింది. దీంతో ఆమె ముఖం కుడి భాగంలో గాయాలయ్యాయి. గ్రామస్తులు రిమ్స్‌కు తరలించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ఫారెస్టు అధికారులు వెల్లడించారు. మహిళ ఆరోగ్య పరిస్థితిపై మంత్రి కొండా సురేఖ అటవీ శాఖ పీసీసీఎఫ్ డోబ్రియాల్‌తో ఫోన్‌లో ఆరాతీశారు.

### దొంగతోగులో పులి గాండ్రింపులు!

ఆళ్లపల్లి, డిసెంబర్ 14 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం దొంగతోగులో శనివారం తెల్లవారుజామున పులి గాండ్రింపులు వినిపించినట్టు గ్రామస్తులు పేర్కొన్నారు. దొంగతోగు గ్రామానికి కిన్నెరసాని అభయారణ్యం దగ్గరగా ఉంటుంది.

భూపతిరావు, అనంతరెడ్డి (ఫైల్)

# మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- దిగుబడులు లేకపోవడం.. అప్పులు భారంగా మారడంతో
- పురుగుమందు తాగి సూసైడ్
- ఖమ్మం, హనుమకొండ జిల్లాల్లో విషాదం

రఘునాథపాలెం/దామెర, డిసెంబర్ 14 : దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడం.. సాగు కోసం చేసిన అప్పులు భారంగా మారడంతో మనస్తాపానికి గురైన ఇద్దరు రైతులు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు ఖమ్మం, హనుమకొండ జిల్లాల్లో శనివారం చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కోటపాడుకు చెందిన యువరైతు గునిపిన్ని భూపతిరావు (30) తన పొలానికి తోడుగా పక్క గ్రామమైన కోయచలకలో మరికొంత కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేస్తున్నాడు. పంట వైరస్‌తో ఎండిపోవడంతో సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురయ్యాడు. శనివారం తన పొలానికి వెళ్లిన భూపతిరావు భార్యకు ఫోన్ చేసి అప్పుల విషయాన్ని ప్రస్తావిస్తూ పురుగుల మందు తాగాడు. అప్రమత్తమైన భార్య గ్రామస్థుల సహాయంతో పొలానికి వెళ్లి భూపతిరావును ఖమ్మం తరలించే క్రమంలోనే మృతిచెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు రఘునాథపాలెం సీఐ తెలిపారు.

### కౌలు రైతు ఆత్మహత్య

హనుమకొండ జిల్లా దామెర మండలం ఒగులాపురం గ్రామానికి చెందిన రైతు మన్నెం అనంతరెడ్డి (65) ఐదెకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. సాగు కోసం 4 లక్షల వరకు అప్పు చేశాడు. దిగుబడి సరిగా రాక అప్పు తీర్చడం కష్టంగా మారింది. మనస్తాపానికి గురై ఈ నెల 6న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ అనంతరెడ్డి శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అశోక్ తెలిపారు.

# ఉగ్ర నరసింహ

**నందమూరి** అభిమానులు ఆతృతతో ఎదురు చూస్తున్న సినిమా 'డాకు మహారాజ్'. నందమూరి బాలకృష్ణ 109వ చిత్రంగా రానున్న ఈ సినిమాకు కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకుడు. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా టైటిల్‌నూ, ప్రచార చిత్రాలను ఇటీవలే విడుదల చేశారు. తాజాగా మ్యూజిక్ ప్రమోషన్స్‌ని కూడా మేకర్స్ మొదలుపెట్టారు. 'ది రేజ్ ఆఫ్ డాకు..' పేరుతో తొలి గీతాన్ని శనివారం విడుదల చేశారు. హీరో పాత్రను ఎస్టాబ్లిష్ చేసేలా అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను తమన్ స్వరపరచగా, భరత్ రాజ్, నకాష్ అజీజ్, రితేష్ జి.రావు, కె.ప్రణతి ఆలపించారు. ''డేగ డేగ డేగ దేఖో వో దేఖో బేగా.. ఈ గుర్రంపై నరసింహం చేసే సవారి ఇదేగా..' అనే పవర్‌ఫుల్ పంక్తులతో అనంతశ్రీరామ్ ఈ పాటను రాశారని మేకర్స్ చెబుతున్నారు. ఇక ఈ వీడియోలో మునుపెన్నడూ చూడని కొత్త అవతారంలో బాలకృష్ణ కనిపిస్తున్నారు. విజువల్స్‌లో భారీతనం కనిపిస్తున్నది. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.

# ఆ వ్యక్తి ఎవరో?

చిత్రం

**'పుష్ప-3'** చిత్రంలో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించే అవకాశం ఉందని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. కొన్నేళ్ల క్రితం విజయ్ దేవరకొండ చేసిన ఓ పోస్ట్‌ను ఉటంకిస్తూ ఈ వార్తను వైరల్ చేస్తున్నారు. 'పుష్ప-2' క్లైమాక్స్‌లో పుష్పరాజ్‌పై ఓ అపరిచిత వ్యక్తి బాంబు దాడికి పాల్పడినట్లుగా చూపించారు. అతను విజయ్ దేవరకొండ అని వార్తలొస్తున్నాయి. తాజాగా ఈ విషయంపై అగ్ర కథానాయిక రష్మిక మందన్న స్పందించింది. ఆమె మాట్లాడుతూ 'దర్శకుడు సుకుమార్ ప్రతీ విషయంలో చివరి వరకూ సస్పెన్స్‌ను కొనసాగిస్తారు. 'పుష్ప-2' క్లైమాక్స్‌లో ఆ సీన్‌ను చూసి నేను కూడా ఆశ్చర్యపోయా. ఆ బాంబు విసిరిన వ్యక్తి ఎవరో తెలుసుకోవాలనే ఉత్సుకత పెరిగింది. నేను కూడా మీలాగే ఆ వ్యక్తి ఎవరో కనిపెట్టాలనుకుంటున్నా' అని చెప్పింది. గత వారం ప్రేక్షకుల ముందుకొచ్చిన 'పుష్ప-2' చిత్రం ఇప్పటికే 1000కోట్ల వసూళ్ల మైలురాయిని దాటి దూసుకుపోతున్నది. ఈ సినిమాలో శ్రీవల్లిగా రష్మిక మందన్న పాత్ర అందరిని ఆకట్టుకుంటున్నది.

# మేకప్‌కే 4గంటలు పట్టేది!



రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'గేమ్ ఛేంజర్' జనవరి 10న ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. దిల్‌రాజు నిర్మాత. ఈ సినిమాలో సీనియర్ నటుడు శ్రీకాంత్ ముఖ్య పాత్రను పోషించారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు శంకర్‌తో పనిచేయాలని ప్రతి ఆర్టిస్టు కోరుకుంటాడు. ఈ సినిమాతో నాకు ఆ అదృష్టం దక్కింది. ఇందులో నేను సీఎం పాత్రను పోషించా. లుక్‌పరంగా ప్రోస్థటిక్ మేకప్‌తో కనిపిస్తా. నేను ఇప్పటివరకు ఆ తరహా మేకప్ వేసుకొని నటించలేదు. మేకప్‌కే నాలుగు గంటల టైమ్ పట్టేది' అన్నారు. ఈ సినిమాలో తన పాత్ర డిఫరెంట్ షేడ్స్‌తో సాగుతుందని, ఎన్నో సస్పెన్స్‌లతో థ్రిల్‌ని పంచుతుందని, కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుందని శ్రీకాంత్ తెలిపారు. 'గోవిందుడు అందరివాడే' చిత్రంలో రామ్‌చరణ్‌తో కలిసి నటించానని, ఇప్పుడు తను నటనలో మరింత పరిణితి సాధించి గ్లోబల్ స్టార్‌గా ఎదిగాడని, రామ్‌చరణ్ పోషించిన అప్పన్న పాత్రను చూస్తే అందరూ షాక్ అవుతారని చెప్పారు. డేట్స్ సర్దుబాటు కానీ కారణంగానే 'గేమ్ ఛేంజర్' షూటింగ్ ఆలస్యమైందని,నిర్మాత దిల్‌రాజు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాను తెరకెక్కించారని శ్రీకాంత్ పేర్కొన్నారు.



# దర్శకుడిగా ఆయనే స్ఫూర్తి

దర్శకుడిగా ఎందరికో స్ఫూర్తినిచ్చారు రాజమౌళి. మరి ఆయనకు స్ఫూర్తినిచ్చింది ఎవరు? అనే విషయం మాత్రం చాలామందికి తెలియదు. డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు ప్రభావం తనపై ఉందని పలు సందర్భాల్లో రాజమౌళి చెప్పారు. అలాగే ఆయన్ని ప్రభావితం చేసిన దర్శకుడు వేరొకరున్నారు. ఆయనే విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీరామారావు. ఇటీవల ఓ టాక్ షోలో ఈ విషయాన్ని వెల్లడించారు రాజమౌళి. 'సినీ దర్శకుడిగా నేను ఎక్కడినుంచి స్ఫూర్తి పొందానో చెప్పడం కష్టం. చిన్నప్పట్నుంచీ చదివిన పుస్తకాలు, చూసిన సినిమాలు, కుటుంబంలోని వ్యక్తులతో జరిగిన చర్చలు. ఇవన్నీ లావాగా మారి నాలోని సృజనను రగిలించి ఉండొచ్చు. ముఖ్యంగా నేను నందమూరి తారక రామారావుగారి వీరాభిమానిని. ఆయన సినిమాలు చిన్నప్పట్నుంచీ ఎక్కువగా చూసేవాడ్ని. అందరికీ ఆయన మహానటుడిగానే ఎక్కువగా తెలుసు. కానీ ఆయన మహా దర్శకుడు కూడా. తనకు తెలిసిన విషయాన్ని జనం మెచ్చేలా మార్చగలననే నమ్మకం ఆయన దర్శకత్వంలో పుష్కలంగా కనిపిస్తుంది. అందుకే దర్శకుడిగా క్లాసిక్స్ తీశారు. ఆయన ప్రభావం కూడా నాపై ఉంది' అని తెలిపారు.

# కొత్త ప్రపంచాన్ని సృష్టించాం!

ట్రెండ్‌కు భిన్నంగా నవీన ఆలోచనలతో, మానవ వ్యక్తిత్వపు లోతుల్ని ఆవిష్కరిస్తూ సినిమాలు తీస్తుంటారు కన్నడ నటుడు, దర్శకుడు ఉపేంద్ర. ఇప్పటివరకు ఆయన డైరెక్ట్ చేసిన చిత్రాలను పరిశీలిస్తే ఆ విషయం అవగతమవుతుంది. తాజాగా ఆయన 'యుఐ' అంటూ ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు. స్వీయ దర్శకత్వంలో ఆయన నటించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హీరో ఉపేంద్ర పాత్రికేయులతో మాట్లాడుతూ పంచుకున్న విశేషాలు..

- మన విద్యా వ్యవస్థలో చాలా లోపాలున్నాయి. చిన్నప్పుడు టీచర్లు ఏం చెబితే దానిని కంఠస్తం చేసేవాళ్లం కానీ లాజికల్ థింకింగ్ ఉండేది కాదు. ఏ ఫర్ ఆపిల్ అని కాకుండా..దానికి మరికొన్ని అక్షరాలు జత చేసి చెప్పమంటే మన ఆలోచనలు మరోలా ఉండేవి. నా కథల్లో కూడా అలా కొత్త విషయాలను చెప్పే ప్రయత్నం చేస్తుంటా.
- ఈ సినిమా కథ రివీల్ చేయడం ఇష్టం లేదు. ఈ సినిమాలోని ప్రతీ విషయంతో ప్రేక్షకులు రిలేట్ అవుతారు. నేను చూపించిన అంశాల్ని డీకోడ్ చేసే ప్రయత్నం చేస్తారు. సమాజంలో చోటు చేసుకుంటున్న వివిధ సంఘటనలను ప్రతీకలుగా తీసుకొని ఈ కాన్సెప్ట్‌ను సిద్ధం చేశా.
- నా సినిమాల్లో చెప్పాలనుకున్న విషయాల్ని ఎలాంటి సంకోచం లేకుండా వ్యక్త పరుస్తాను. కొత్త మార్గాల్ని అన్వేషించాలన్నదే నా సిద్ధాంతం. ఎలాంటి లెక్కలు వేసుకోకుండా గట్ ఫీలింగ్‌తో సినిమాలు తీస్తా (నవ్వుతూ).
- మనం ఎక్కువగా సమస్యల మీదనే మాట్లాడతాం కానీ వాటి పరిష్కారం గురించి పెద్దగా పట్టించుకోం. ఎందుకంటే సొల్యూషన్ కనిపెట్టడం చాలా కష్టమైన పని. నా సినిమాల ద్వారా సొల్యూషన్స్ గురించి ఆలోచించమని చెబుతుంటాను.
- సినిమాల ద్వారా సందేశం అందించాలని ఎప్పుడూ అనుకోలేదు. ప్రేక్షకులను మారమని చెప్పడానికి నేనెవరిని ? నేను సందేశాలివ్వను, తీసుకోను కూడా.

# బచ్చలమల్లి హిట్ గ్యారెంటీ

'ఈ సినిమా టీజర్ చూసి నరేష్‌కి ఫోన్ చేశా. తప్పకుండా హిట్ అవుతుందని చెప్పాను. ఈ సినిమా కోసం ఏదైనా చేయాలనే తపనతో ఈవెంట్‌కు వచ్చాను. ట్రైలర్‌ను లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అన్నారు హీరో నాని. శనివారం జరిగిన 'బచ్చలమల్లి' చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అల్లరి నరేష్ కథానాయకుడిగా సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. వర్షంలో అల్లరి నరేష్ అపస్మారక స్థితిలో పడివున్న సీన్‌తో ట్రైలర్ ఆసక్తికరంగా మొదలైంది. బచ్చలమల్లిగా నరేష్ బోల్డ్, రగ్గెడ్ క్యారెక్టర్‌లో సరికొత్త మేకోవర్‌తో కనిపించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. దర్శకుడు సుబ్బు తాను నటించిన 'మజ్ను' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడని, అద్భుతమైన ప్రతిభావంతుడని, ఈ కథను రియలిస్టిక్‌గా తెరకెక్కించాడని ప్రశంసించారు. అల్లరి నరేష్ మాట్లాడుతూ 'నానితో 16 ఏళ్లుగా అనుబంధం కొనసాగుతున్నది. నేను ఫెయిల్యూర్స్‌లో ఉన్నప్పుడు ధైర్యాన్నిచ్చాడు. దర్శకుడు సుబ్బు ఎంత అద్భుతంగా కథ చెప్పాడో అదే క్లారిటీతో సినిమా తీశాడు' అన్నారు. ఈ సినిమాలో నరేష్ పాత్ర మరో స్థాయిలో ఉంటుందని దర్శకుడు సుబ్బు మంగాదేవి చెప్పారు. ఈ క్రిస్మస్‌కి బచ్చమల్లి మోత మోగిస్తాడని నిర్మాత రాజేష్ దండా ఆశాభావం వ్యక్తం చేశారు.

HASYA MOVIES
DECEMBER 20TH
IN CINEMAS WORLDWIDE
NARESH
బచ్చలమల్లి
A FILM BY